క్లుప్తంగా

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా పాదాలమ్మ, బంగారమ్మ పండగ



పాదాలమ్మను దర్శించుకుంటున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: పాత గోశాల వద్ద ఉన్న సింహగిరి పునరావాసుల కాలనీలో కొలువుదీరిన పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. కాలనీవాసులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఈఈ శ్రీనివాసరాజు అమ్మవార్లను దర్శించుకున్నారు.

20న సబ్బవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు మండల పరిషత్ ఏవో ఎస్.బాబూరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు వెంకటాద్రిపై తొలి ఏకాదశి పూజలు



పెందుర్తి : పవిత్ర తొలి ఏకాదశి సందర్భంగా వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధ, గురువారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 5.30కి సుప్రభాత సేవ, అష్టోత్తర పూజలు చేస్తారు. అనంతరం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 వరకు ఏకాహం, విష్ణు సహస్రనామ పారాయణ చేస్తారు. సాయంత్రం 6 నుంచి స్వామివారికి లక్ష తులసి పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులంతా హాజరు కావాలని అర్చకుడు రామానుజాచార్యులు కోరారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్నమనాయుడు

భీమునిపట్నం : జీవితాలను సర్వనాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నమనాయుడు సూచించారు. మాదక ద్రావ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు తీసుకునే వారు అన్ని విధాలుగా నష్టపోతారని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసలు కావొద్దని హెచ్చరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర శివారులో 'మత్తు' వాసన

- ఆనందపురం – అనకాపల్లి బైపాస్ మీదుగా అక్రమ రవాణా
- స్మగ్లర్లకు నెలవుగా మారుతున్న జనావాసాలు



కారులో తరలిస్తున్న గంజాయి

పెందుర్తి : ప్రశాంతంగా ఉన్న నగర శివారులో అడపాదడపా ఆర్థిక నేరాలు, దొంగతనాలు జరగడం పరిపాటి. అప్పుడప్పుడు హత్యలు, అత్యాచారాలతో శివారు ప్రాంతం వార్తల్లో నిలుస్తుంది. ఈ క్రమంలో మరోసారి పెందుర్తి ప్రాంతం ఎవరూ ఊహించని ఘటనలకు నిలయంగా మారింది. నగర శివారులో చెన్నై – కోల్‌కతా హైవేపై మత్తు పదార్థాల వాసన గుప్పుమంటోంది. ఆనందపురం – అనకాపల్లి బైపాస్ రహదారి కేంద్రంగా గంజాయి, గుట్కా, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను అక్రమంగా ఎగుమతి, దిగుమతి చేయడం కలకలం రేపుతోంది. ఈ అక్రమ వ్యాపారంలో ఏజెన్సీ వాసులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు పట్టుబడుతున్నారు. రవాణాకు వీలుగా ఈ రహదారికి సమీపంలోనే మత్తు పదార్థాల నిల్వకు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సమయం చూసుకుని పోలీసుల కళ్లుగప్పి నగరంలోకి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.



పెందుర్తి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్న గంజాయి

సులభంగా అక్రమ రవాణా

ఆనందపురం – అనకాపల్లి జాతీయ రహదారి (బైపాస్) పెందుర్తి నుంచి వెళ్లడంతో గంజాయితోపాటు ఇతర వస్తువుల అక్రమ రవాణాకు కూడా మార్గం సుగమమైంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలపడంతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఈ రహదారి మార్గం చూపుతోంది. దీంతో అక్రమ రవాణా పెరిగిపోయింది. ముఖ్యంగా గంజాయిని ఏజెన్సీ నుంచి పెందుర్తికి తీసుకొచ్చి ఇక్కడి నుంచి తూకాలు వేసి స్మగ్లర్లు అవసరమైన వారికి రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచే గంజాయి తరలిపోతున్నట్లు తెలుస్తోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై తనిఖీలు జరుగుతున్నా స్మగ్లర్లు తమదైనశైలిలో అధికారులను బురిడీ కొట్టించి సరకును తరలించుకుపోతున్నారు. ఇందుకు పర్యాటక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల స్టిక్కర్లు వాహనాలపై అతికిస్తుండడం గమనార్హం.

నివాసాల మధ్యలోనే నిల్వచేసి..

పెందుర్తి ప్రాంతంలో సుజాతనగర్ అంటే పూర్తిగా క్లాస్ ప్రాంతం. కానీ ఇక్కడ ఐదేళ్ల క్రితం జరిగిన దాడిలో ఓ ఇంట్లో 410 కిలోల గంజాయి దొరికింది. కొన్నాళ్ల క్రితం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గంజాయితోపాటు నలుగురు తమిళ స్మగ్లర్లు, ఇద్దరు ఏజెన్సీ వాసులు పట్టుబడ్డారు. ఆ తర్వాత పలుమార్లు స్మగ్లర్లు పోలీసులకు చిక్కారు. తాజాగా పెందుర్తికి ఆనుకుని ఉన్న పులగాలిపాలెంలో ఓ అధునాతన భవనంలో నిల్వ ఉన్న 75 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆయా ఇళ్లల్లో దొరికిన వారు దీర్ఘకాలికంగా అద్దె ఇళ్లల్లో ఉండడం చూస్తుంటే ఎన్ని లక్షల కిలోల గంజాయి ఇక్కడి నుంచి సరఫరా చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. ఇక ఇతర మత్తు పదార్థాల నిల్వ కోసం రహదారికి ఆనుకుని ఉన్న గొడౌన్లను అద్దెకు తీసుకుంటున్నారు. ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి ప్రాంతాల్లో గొడౌన్లను అక్రమ వ్యాపారులు తమ స్థావరాలుగా చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిరంతరం నిఘా ఉంచుతున్నాం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు '100 రోజుల ప్రణాళిక – గంజాయి నిర్మూలన'లో భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచుతున్నాం. ముఖ్యంగా రవాణాకు అనుగుణంగా ఉండే రోడ్లపై మా సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తున్నారు. ఎక్కడ గంజాయి సమాచారం ఉన్నా 94407 96008 (ఏసీపీ), 94407 96039 (సీఐ) నంబర్లకు సమాచారం ఇవ్వండి.

– రామకృష్ణ, పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

వైభవంగా అమ్మవార్ల పండగ



పెందుర్తిలో పైడిమాంబను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తి గ్రామ ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పీలా గోవిందసత్యనారాయణ, గండి బాబ్జీ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు గొర్లె రామునాయుడు, గొర్లె శ్రీనివాసరావు, దాసరి శ్రీను, గొర్లె రామునాయుడు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- వేపగుంట బీసీ కాలనీలో కొలువుదీరిన పెంటమాంబ, మోదకొండమ్మ అమ్మవార్ల పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఫార్మా వ్యర్థ జలాల తొలగింపు



గెడ్డలోని వ్యర్థ జలాలు తరలిస్తున్న అధికారులు

పరవాడ : మండలంలో భర్నికం సమీపంలోని మొల్లోడి గెడ్డలో నిలిచిపోయిన ఫార్మా వ్యర్థ జలాలను తొలగించే ప్రక్రియను రాంకీ యాజమాన్యం మంగళవారం చేపట్టింది. గ్రామానికి సమీపంలో గల మొల్లోడి గెడ్డలో పేరుకుపోయిన ఫార్మా వ్యర్థ జలాల కారణంగా దుర్వాసనతో తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని, తక్షణమే తొలగించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అనకాపల్లి కలెక్టర్‌కు సోమవారం మొరపెట్టుకున్నారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థాలు తొలగించాలని పీసీబీ అధికారులను ఆదేశించారు. దీంతో పీసీబీ అధికారులు ట్యాంకరు ద్వారా గెడ్డలోని ఫార్మా వ్యర్థాలు మంగళవారం తొలగించారు.

పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సింహాచలం: పంచ గ్రామాల భూసమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో కలిసి బీఆర్‌టీఎస్ బాధితులతో గంటా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ పంచ గ్రామాల సమస్యకు 90 శాతం పరిష్కారం వచ్చిన తర్వాత న్యాయపరమైన చిక్కుల్లోకి వెళ్లిందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యపై చర్చిస్తామన్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. సమస్యలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలను తక్షణం అమలు చేస్తామని, అంతకు మించి ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సమావేశంలో ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా దేశపాత్రునిపాలెం కూడలి



దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలిలో గోతులతో నిండిన రహదారి

పరవాడ: దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి అధ్వానంగా తయారైంది. రహదారి మీదుగా బూడిద లారీలు వందల సంఖ్యలో తరచూ రాకపోకలు సాగించడం వల్ల రైల్వే వంతెన సమీపంలో కూడలి గోతులమయంగా మారింది. ఈ రహదారి మీదుగా నిత్యం గాజువాక, విశాఖ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, ఉపాధి కూలీలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం వర్షం పడినా గుంతల్లో నీరు చేరి రహదారి చెరువును తలపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడలిలో పడిన గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, 'నాడు – నేడు' పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సుశీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుల సమావేశం శ్రీదేవి పార్కులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి స్థానికులకు దత్తనివ్వడంతో పాటు పార్కుల్లో బ్యూటిఫికేషన్‌కు సంబందించిన మొక్కలు దాతల ద్వారా అందిస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు నెల చివరి వారంలో అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెప్టెంబరులో నిర్వహించే వినాయక చవితికి మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ చేయాలని సభ్యులు నిర్ణయించారు. ఇందుకు రూ.20,000లు అవసరమవుతుందని అంచనా వేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వరప్రసాద్ తన వంతుగా రూ.10,000లు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. గురు పౌర్ణమి, సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా కమిటీ సభ్యులు సతీష్ కుమార్, కుమార్, శ్రీనివాస్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సభ్యులు పాల్గొనాలని నిర్ణయించారు.

రాయితీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, తదితరులు

సబ్బవరం: రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి కోరారు. అంతకాపల్లి సచివాలయం వద్ద గ్రామంలోని రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. సుమారు 220 ధాన్యం బ్యాగులను రైతులకు అందజేశారు. వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, ఉప సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు, తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబరులో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఉచిత శిక్షణ, మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని సూచించారు.

మందుబాబులకు రూ.1.6 లక్షల జరిమానా

భీమునిపట్నం : భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు 16 మంది దొరకగా వారికి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.6 లక్షల జరిమానా విధించారు.

స్టీల్‌ప్లాంట్‌పై సదస్సు నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహిస్తున్నారు. 'సంక్షోభంలో విశాఖ ఉక్కు – పరిష్కారం ఎలా ' అనే అంశంపై సాయంత్రం 5.30 గంటలకు ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. స్టీల్ ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సదస్సులో పాల్గోనున్నారు. సదస్సుకు ఉద్యోగులందరూ హాజరు కావాలని జె.అయోధ్యరామ్, యు.రామస్వామి కోరారు.

ఉద్యానవనాల సాగు లాభదాయకం



రైతుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

విశాఖ విద్య : ఉద్యానవనాల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మర్రిపాలెం రైతు బజారులో మంగళవారం ఉద్యానవనాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల వద్ద సాగు చేస్తూ, రైతు బజార్లలో విక్రయాలకు కూరగాయలు తీసుకొస్తున్న పలువురు రైతులతో మాట్లాడారు. సాగులో వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన వనాల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. తక్కువ విస్తీర్ణంలోనే రోజువారీ ఆదాయం సంపాదించేలా పంటలు పండించవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువుల వాడకం గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి సోని, విస్తరణ అధికారి త్రినాథ్, రైతుబజారు ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు



ఈ.బోనంగిలో శునకాల కోసం వేట సాగిస్తున్న సిబ్బంది

పరవాడ : మండలంలో శునకాల నియంత్రణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి ఆదేశాల మేరకు మండలంలో దశల వారీగా శునకాల ఏరివేతకు చర్యలు చేపట్టామని మండల పంచాయతీ అధికారి కె.రమేష్‌నాయుడు చెప్పారు. తొలుత మండలంలో ఈ.బోనంగి గ్రామంలో మంగళవారం శునకాల ఏరివేతకు చర్యలు చేపట్టారు. గ్రామంలో పట్టిన శునకాలను కొమ్మాదిలోని పశువైద్యశాలకు తరలించి అక్కడ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం 60 శునకాలను పట్టి కొమ్మాది తరలించారు. త్వరలో మిగిలిన గ్రామాల్లోనూ శునకాల నియంత్రణకు చర్యలు చేపడతామని ఈవోఆర్డీ రమేష్‌నాయుడు చెప్పారు.

హెల్మెట్ ధరించకుంటే ప్రాణాపాయం



జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

భీమునిపట్నం : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల్లో చాలా మంది అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకర విషయమన్నారు. ఈ విషయంలో ఎవరూ అజాగ్రత్తగా ఉండకూడదని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ర్యాలీలో డైట్ ఛాత్రోపాధ్యాయులు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, కార్యదర్శి కె.ఎస్.ఎం.సుధాకర్, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు నమ్మి సూరిబాబు, డి.కనకమహాలక్ష్మి, వి.అరుణకుమారి, ఏజీపీ పాత్రుడు, సీనియర్ న్యాయవాదులు భరద్వాజ్, బి.ఈశ్వరరావు, సురేష్ రెడ్డి, బాల భాస్కర్, ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మధురవాడ : ఆర్‌టీఏ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విశాఖ నార్త్ జోన్ పరిధిలోని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాంతారావు హెచ్చరించారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మాది జంక్షన్ వద్ద బ్లాక్ ఫిల్మ్‌తోపాటు నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్ ఉన్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని పరిశీలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్లాక్ ఫిల్మింగ్ ఉండకూడదని, నంబర్ ప్లేట్ కూడా నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని సూచించారు. సదరు వాహనం ఫిల్మ్ తొలగిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసినా, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్‌తో సదరు వాహనదారులతోపాటు ఇతరులు కూడా ఇబ్బంది పడతారన్న విషయం గుర్తించుకోవాలన్నారు. మధురవాడ, కొమ్మాది, మారికవలస, కార్‌షెడ్, క్రికెట్ స్టేడియం తదితర ప్రాంతాల్లో నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కాంతారావు కోరారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం



రవీంద్రభారతి విద్యార్థులతో సీఐ రామకృష్ణ

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాల్సిన అవసరం ఉందని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. పట్టుదల, అంకిత భావంతో చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థి నాయకుల నుంచి సీఐ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జీఎం రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

గోపాలపట్నం : నేవల్ ఆర్మ్‌మెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు భరోసా కల్పించాలని, సభ్యుల లోన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఎన్‌ఏడీ ప్రధాన గేటు వద్ద నేవల్ ఆర్మ్‌మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్‌ఏడీ సివిలియన్ కోఆపరేటివ్ సొసైటి పాలక వర్గం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. సభ్యుల లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందని దుయ్యబట్టారు. పాలక మండలి తీరు భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. గతంలో ఉన్న పాలక మండలి సలహా కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.